## క్లుప్తంగా

### అల్పాహారం అందజేత



అల్పాహారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు గురువారం మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా అల్పాహారాన్ని పంపిణీ చేశారు. సూరంపల్లి రాధాకృష్ణ, తీగల మోహన్‌రావు, శివప్రసాద్, సతీష్‌కుమార్, కాంతయ్య, మోహన్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, గోవర్ధన్, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎస్ శిబిరం



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు చందనపల్లిలో శీతాకాల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వేణు, డాక్టర్ శీలం యాదగిరి, పెరిక మధు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న అంజనేయులు

చండూరు : బీజేపీ చండూరు మండల అధ్యక్షుడిగా చామలపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఆంజనేయులు నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.నాగం వర్షిత్‌రెడ్డి చేతుల మీదుగా ఆంజనేయులు నియామక పత్రం అందుకున్నారు.

### ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సైదులు



నియామక పత్రం అందుకుంటున్న సైదులు

నల్లగొండ టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా వడ్డెబోయిన సైదులు నియమితులయ్యారు. ఈమేరకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి గురువారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సైదులుకు నియామకపత్రం అందజేశారు.

### విద్యార్థులకు షూ పంపిణీ



షూలు అందజేస్తున్న సైదులు

నాంపల్లి : మండల కేంద్రానికి చెందిన గాదెపాక సైదులుకు ఇటీవల గురుకుల టీజీటీ ఉద్యోగం వచ్చింది. దీంతో తన కుమారుడు, కుమార్తె చదువుతున్న స్థానిక ప్రాథమిక పాఠశాలలో 28 మంది విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, ఉపాధ్యాయుడు కె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కేతేపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఉయ్యాల మంగమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పి.సుధాకర్‌రెడ్డి, గుత్త మాధవరెడ్డి, కె.మల్లేష్‌యాదవ్, పి.గోవర్ధన్‌రెడ్డి, కె.వీరన్న, లింగమూర్తి తదితరులు ఉన్నారు.

### నేడు ఉచిత కంటి పరీక్షలు

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మ్యాక్సివిజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు ఉద్యోగులకు హెల్త్ కార్డుపై ఉచిత కంటి పరీక్షతో పాటు ఆపరేషన్లు చేస్తారన్నారు.

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఎండుతున్న పంట పొలాలు
- కన్నీరుమున్నీరవుతున్న రైతన్నలు
- కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు



యరగండ్లపల్లిలో ఎండిన పెద్ద చెరువు

మర్రిగూడ: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు చేతికి అందే దశకు చేరేసరికి భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతుండడంతో రైతులు అందోళన చెందుతున్నారు. బోర్లు వట్టిపోతుండడంతో పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవేమోనని రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

**మండలంలో చెరువులు, కుంటలు..**

యరగండ్లపల్లిలో 3, అజ్జలాపురం-1, ఖుదాబాక్షపల్లి-4, లెంకలపల్లి-2, మేటిచందాపురం-1, కొట్టాల-2, ఇందుర్తి-3, శివన్నగూడ-1, సరంపేట -1, దామెరభీమనపల్లి-6, బట్లపల్లి-2, మర్రిగూడ-14, కొండూరు -1, కొండూరు తండా -1 మొత్తం మండలంలో 42 చెరువులు కుంటలు ఉన్నాయి. ఇందులో యరగండ్లపల్లిలో 2, దామెరభీమనపల్లిలో ఒకటి తప్ప మిగతావి చిన్న చెరువులు, కుంటలు. ఈ చెరువుల కింద దాదాపు 10వేల ఎకరాల వరకు పంటలు సాగవుతాయని అంచనా.

**సాగు వివరాలు**

మర్రిగూడ మండల వ్యాప్తంగా వరి 5,078 ఎకరాలు, జొన్నలు 26 ఎకరాలు, మొక్కజొన్నలు 3 ఎకరాలు, గడ్డిజొన్న 5.31 ఎకరాలు, ఆముదం 3 ఎకరాలు, వేరుశెనగ 79.28 ఎకరాలు, ఇలా మొత్తం 5,195.19 ఎకరాల్లో రైతులు యాసంగిలో సాగు చేశారు. పంటలు సాగు చేస్తున్న సమయంలో సరిపడా నీరు ఉంది. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడకపోయినప్పటికీ ఉన్న నీటితోనే పంటలను సాగు చేసుకుందామని రైతులు భావించారు. అయితే ఫిబ్రవరి మాసం నుంచే ఎండలు విపరీతంగా కాస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోయాయి. కొందరు రైతులు చేసేదేమి లేక పంటలను వదిలివేశారు. మరికొందరు సమీప రైతుల నుంచి తమ పంటలకు తాత్కాలికంగా నీరందించడంతో కాస్తా ఊపిరి పీల్చుకుంటున్నారు.

**వర్షపాతం ఇలా..**

గత జూన్ నుంచి ప్రస్తుత మార్చి నెల వరకు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడ మండల వ్యాప్తంగా జూన్ నెలలో 95.7ఎంఎం, జూలై-189.1ఎంఎం, ఆగస్టు-49.2ఎంఎం, సెప్టెంబర్-153.6ఎంఎం, అక్టోబర్- 0, నవంబర్ -9.8ఎంఎం, డిసెంబర్-6.3ఎంఎం, జనవరి- 0, ఫిబ్రవరి-0, మార్చి-0 వర్షపాతం నమోదయింది. దాదాపు 150 నుంచి 200 ఎకరాల్లో నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండినట్లు అంచనా. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో 500 నుంచి 1000 ఫీట్ల వరకు బోర్లు వేసినా చుక్క నీరు దొరకని దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఎండిపోయిన పంటలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని పంటలు నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

**మూడు బోర్లు ఒట్టిపోయాయి**



రెండేళ్ల క్రితం వేసిన బోరులో నీరు సరిపడా ఉందని రెండెకరాల్లో బత్తాయి మొక్కలను నాటి అందులో అంతర పంటగా వేరుశెనగ, కొంత వరి సాగు చేశా. బోరు వట్టిపోవడంతో ఇటీవల రెండు బోర్లు వేయించా. అవి కూడా ప్రస్తుతం పూర్తిగా వట్టిపోయాయి. వేరుశెనగకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. వరి పంటకు సమీప రైతుల నుంచి నీరు అందించి కాపాడుకుంటున్నా. లక్షల్లో నష్టపోయాను.

– వడ్డె సైదులు, రైతు, రాంరెడ్డిపల్లి

**పశువులకు మేపుతున్నాం**



మూడెకరాల వరి సాగు చేస్తే 20 రోజుల నుంచి ఉన్న రెండు బోర్లు ఎండిపోయాయి. చుక్క నీరు పోయడం లేదు. మా ఊరి చెరువులో నీళ్లు ఉంటే మోటార్లు పోసేవి. వరి చేలు ఎండిపోతుండడంతో పశువులను మేపుతున్నాం. లక్ష రూపాయలకు పైగా ఖర్చు వచ్చింది.

– కంబాలపల్లి లింగయ్య (రైతు, కొట్టాల)

**మా దృష్టికి రాలేదు**

భూగర్భ జలాలు తగ్గి పంటలు ఎండుతున్నట్లు మా దృష్టికి రాలేదు. అక్కడక్కడ తెగులు సోకిన చేలకు నివారణకు మార్గాలు చెప్తున్నాం. ప్రభుత్వం నుంచి సర్వే చేయాలని ఎలాంటి ఆదేశాలు అందలేదు.

–హేమలత, ఏఓ, మర్రిగూడ

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

నార్కట్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన ఎత్తు ఉండేవిధంగా గుర్తించి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని నకిరేకల్ సీడీపీఓ అంజూమ్ అన్నారు. గురువారం మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు నాలుగు రకాల పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీరాములు, సూపర్‌వైజర్లు సరిత, అంజమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్ తదితరులున్నారు.

**గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి**

కనగల్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల కోరారు. పోషణ పక్షంలో భాగంగా రేగట్టె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషక విలువలు గల ఆహార పదార్థాలపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం**

మర్రిగూడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తమ రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, విమలాదేవి, లక్ష్మీ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



కనగల్ : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల



మర్రిగూడ : చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ యశోద

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నల్లగొండ రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ మండల ఎంపీపీ సుమన్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది వర్షాలు లేని కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. ట్యాంకర్ల ద్వారా గ్రామ ప్రజలకు సరిపడా నీరు అందించాలన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు రైతులను సమాయత్తం చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు అరుంధతి, వెంకట్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, అనంతరెడ్డి, స్ఫూర్తి, వినోద, ప్రజాప్రతినిధులు విజయ, స్వాతి, సైదులు, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిక

మర్రిగూడ: మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. మండల కేంద్రానికి చెందిన పందుల రాములుగౌడ్, వట్టిపల్లికి చెందిన కొంపల్లి నాగరాజుగౌడ్‌లకు హైదరాబాద్‌లో నర్సయ్యగౌడ్ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ యాస అమరేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్‌నాయక్, యాదయ్య, గ్యార గోపాల్, రాజుగౌడ్, శ్రీనివాస్‌రావు, వెంకటేష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బూర నర్సయ్యగౌడ్

## వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దివీస్ ప్రతినిధి

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం దివిస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ అందజేశారు. కార్యక్రమంలో దివీస్ ల్యాబోరేటరీస్ ప్రతినిధులు డాక్టర్ మురళి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లచ్చిరామ్ నాయక్, నరసింహ, రాణి, వెంకటేశ్వర్లు గ్రామస్తులు కట్ట నాగరాజు, కట్ట శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరేష్ నేత్రదానం



సింగరి నరేష్ (ఫైల్)

నకిరేకల్: కేతేపల్లి మండలం ఇనుపాముల శివారులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నకిరేకల్ వాసి సింగరి నరేష్ కళ్లను అతడి తల్లిదండ్రులు సింగరి రాములు-యాదమ్మ గురువారం దానం చేశారు. వారి కుమారుడు నరేష్ కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి కళ్లు దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఖమ్మంలో ఉన్న ఐ బ్యాంక్‌ను సంప్రదించగా నకిరేకల్‌లోని మర్చ్యూరీలో భద్రపరిచిన నరేష్ మృతదేహంలోని కళ్లను సేకరించి తీసుకెళ్లారు. తమ కుమారుడు మృతి చెందినా అతడి కళ్లు ప్రపంచాన్ని చూడాలనే సదుద్దేశంతో కళ్లను దానం చేశామని తల్లిదండ్రులు తెలిపారు. గురువారం నరేష్ అంత్యక్రియలు నిర్వహించారు. నరేష్ మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి పూలమాలల వేసి నివాళులర్పించారు.

## నేడు రథోత్సవం

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని రాములబండలో సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ దోమలపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. 23న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం నల్లగొండ నుంచి ఉచితంగా ప్రైవేటు బస్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్తలు దోమలపల్లి శశిధర్‌రావు, ప్రభాకర్‌రావు, హరికృష్ణ, సందీప్, మాజీ సర్పంచ్ జయమ్మ, శంకర్‌గౌడ్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కీర్తి పురస్కారం అందుకున్న శ్రీనివాస్



పురస్కారం అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్, స్టేట్ జ్యుడిషియల్ డైరెక్టర్

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అనుముల శ్రీనివాస్‌కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గురువారం కీర్తి పురస్కారం-2022 అందజేసింది. హైదరాబాద్‌లోని విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జ్యుడిషియల్ డైరెక్టర్ మంగారి రాజేందర్, విశ్వ విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ తంగడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ బట్టు రమేష్ కీర్తి పురస్కారాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసినందుకుగాను అయ్యంకి వెంకటరమయ్య స్మారక కీర్తి పురస్కారాన్ని శ్రీనివాస్‌కు వారు అందజేశారు. పురస్కారంతో పాటుగా సన్మాన పత్రం, ఐదు వేల నూటాపదహారు రూపాయలు అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు వచ్చిన కీర్తి పురస్కారాన్ని తన స్వగ్రామం గుండ్రాంపల్లికి అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

## బీజేపీ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

కనగల్: బీజేపీ కనగల్ మండల నూతన కమిటీని గురువారం పార్టీ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా దాసరి వెంకన్న, బైరగోని అశోక్, ఉపాధ్యక్షులుగా మనిమద్దె వీరయ్య, నిమ్మల సుధాకర్ రెడ్డి, పంతంగి సైదులుగౌడ్, మాదగోని ఏడుకొండలు, జనగం సురేష్, జనగం భిక్షం కార్యదర్శులుగా సముద్రాల మల్లేష్, ఆరెకంటి సుజాత, చింతల శంకర్, బోగరి తిరుపతయ్య, నూనె చంద్రమోహన్ కోశాధికారిగా కట్ట మోహన్‌బాబును నియమించారు.

## రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు మృతి



సింగం గిరి (ఫైల్)

మర్రిగూడ: మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగం గిరియాదవ్ (50) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు.. గిరియాదవ్ ఏప్రిల్ 5వ తేదీన తన కుమార్తె వివాహం పెట్టుకున్నాడు. గురువారం పెళ్లి కార్డులు పంచేందుకు హైదరాబాద్‌లోని వనస్థలిపురం నుంచి సదాశివపేటకు వెళ్తుండగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై ముందు ఉన్న లారీని గిరియాదవ్ ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గిరియాదవ్ అక్కడికక్కడే మృతిచెందగా.. కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

## 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని ధనలక్ష్మి రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో గురువారం పోలీసులు తనిఖీ చేసి 30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించి, బియ్యం నిల్వ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

## నేడు 'రజాకార్' విజయోత్సవ కార్యక్రమం

చిట్యాల: పట్టణంలోని సుజన థియేటర్‌లో శుక్రవారం రజాకార్ చిత్ర యూనిట్ విజయోత్స కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ థియేటర్ మేనేజర్ చావా ప్రసాద్, చిత్ర దర్శకుడు యాట సత్యనారాయణ బాల్య స్నేహితుడు జయారపు రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు దర్శకుడు యాట సత్యనారాయణ, నటులు ఇంద్రజ, అనసూయ, ప్రేమ, చిత్ర నిర్మాత గూడూరు నారాయణరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ వేడుకలో పట్టణ ప్రజలు, సినీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కల్లుగీత కార్పొరేషన్ ప్రకటించకపోవడం బాధాకరం

మర్రిగూడ : ప్రభుత్వం అనేక కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించి కల్లుగీత కార్పొరేషన్ ప్రకటించకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్లుగీత వృత్తిపై అనేకమంది గీత కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలని కోరారు.

## హైదరాబాద్‌కు తరలివెళ్లిన పంచాయతీ కార్మికులు

నాంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు గురువారం హైదబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాంపల్లి మండల అధ్యక్షుడు నాంపల్లి నరేష్, వెంకటయ్య, మరియమ్మ, వైష్ణవి, యాదగిరి, నిరంజన్, ఎల్లయ్య, వెంకటయ్య, స్వామి, జైపాల్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, జలందర్, రవితేజ, కృష్ణయ్య, రాములమ్మ, పార్వతమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న సోలార్ ఎనర్జీ సంస్థ ప్రతినిధులు

నాంపల్లి : పసునూరు గ్రామ పంచాయతీ, నాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం సోలార్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్, ప్రింటర్‌తోపాటు మూడు వాటర్ ప్యూరిఫైడ్ కూలర్లను అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ కో ఆర్డినేటర్ ప్రభాకర్, విజయ్, ప్రధానోపాధ్యాయుడు యుగేందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తుడు బుడిగ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ జూకూరి రమేష్‌ను గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విజయేందర్ రెడ్డి, యూపీఎఫ్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ రాజు ఘనంగా సన్మానించారు. జాన్‌బాబు, రవికుమార్, దాసరి ప్రీతి ప్రశాంత్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అధ్యక్షుడికి ..**

నాంపల్లి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కత్తి రవీందర్‌రెడ్డిని గురువారం ముకుందాపురం గ్రామ మాజీ సర్పంచ్ మలిగిరెడ్డి చంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వల్లపు శివ, ప్రవీణ్, ఆంజనేయులు, శ్రీరాములు, కళ్యాణ్ తదితరులున్నారు.

# నీళ్లులేక ఎండుతున్న వరిచేలు

- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో ఎండిపోయిన వరిచేను

శాలిగౌరారం: భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి బోర్లు, బావులు వట్టిపోతుండడంతో పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గడచిన వర్షాకాలం సీజన్‌లో వర్షాలు సరిపడా కురవకపోవడంతో శాలిగౌరారం మండలంలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదు. దీనికితోడు శాలిగౌరారం ప్రాజెక్టులోకి మూసీనది నుంచి వరదనీరు వచ్చే రాచకాల్వకు గండిపడడంతో ప్రాజెక్టులోకి వరదనీరు చేరలేదు. దీంతో శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వకు అనుసంధానంగా ఉన్న మండలంలోని రామాంజాపురం, ఉప్పలంచ, ఎన్‌జీ కొత్తపల్లి చెరువులు, కుంటల్లోకి నీరువచ్చి చేరలేదు. అదేవిధంగా ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న గురుజాల, అడ్లూరు, మాధారంకలాన్ చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో ఆయా చెరువులు, కుంటలు నీటి నిల్వలు లేక వెలవెలబోతున్నాయి. నిరంతర విద్యుత్ సరఫరాతో బోర్లు నీటిని తోడిపోస్తుండడంతో భూగర్భజలాలు మరింత అడుగంటిపోతున్నాయి. వ్యవసాయ బావులు, బోర్లు వట్టిపోవడంతో వాటి కింద రైతులు సాగుచేసిన వరిపంటలు ఎండిపోతున్నాయి.

**ఐదు గ్రామాల్లో పరిస్థితి అధ్వానం..**

శాలిగౌరారం మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో నాన్ ఆయకట్టుగా భైరవునిబండ, తక్కెళ్ళపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. శాలిగౌరారం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న రామాంజాపురం, ఎన్‌జీ కొత్తపల్లి, శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, జాలోనిగూడెం, శాలిలింగోటం, రామగిరి, అడ్లూరు, మాధారంకలాన్, అంబారిపేట, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాలు, మూసీనది పరివాహక గ్రామాలుగా ఉన్న ఉప్పలంచ, మనిమద్దె, గురుజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాల్లో భూగర్భ జలాల తగ్గుదల తక్కువగా ఉంటుంది. నాన్ ఆయకట్టు గ్రామాలైన భైరవునిబండ, తక్కెళ్ళపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారంలలో భూగర్భ జలాలు 40 మీటర్ల నుంచి 60 మీటర్ల లోతుకు పడిపోగా ఆయకట్టు ప్రాంతంలో 15 నుంచి 20 మీటర్ల లోతుకు పడిపోయాయి.

**2వేల ఎకరాల్లో ఎండిన వరిచేలు**

శాలిగౌరారం మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 17,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీళ్ల లేక వందల సంఖ్యలో బోరుబావులు వట్టిపోయాయి. దీంతో ఆయా బోరుబావుల కింద సుమారు 2 వేల ఎకరాల్లో వరి చేలు పూర్తిగా ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ పరిస్థితులు లేకపోవడం, నూతనంగా బోర్లు వేసినా పడకపోవడంతో రైతులు ఎండిన పంటలను విధిలేని పరిస్థితుల్లో వదులుకోక తప్పడం లేదు. మండలంలో గడిచిన యాసంగి సీజన్‌లో 23 వేల ఎకరాల్లో వరి సాగు కాగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో సుమారు 5500 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

**పంట సాగుచేసి అప్పులపాలయ్యా**



నాకున్న రెండు బోర్ల కింద నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. పంట పొట్టదశకు రాగానే ఒకబోరు పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంటను కాపాడుకునేందుకు మరో రెండుబోర్లు వేశా. ఆ రెండు బోర్లు ఫెయిలయ్యాయి. నాలుగు ఎకరాల్లో మూడున్నర ఎకరాల వరిచేను పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమి లేక వరిచేను వదిలివేశా. పంట పెట్టుబడి, బోర్లకు కలిపి రూ.రెండు లక్షలు అప్పు అయ్యింది. పంట సాగుచేసి అప్పులపాలయ్యా.

– కారింగుల శివ, రైతు, వల్లాల, శాలిగౌరారం మండలం

**నాలుగు ఎకరాలు ఎండిపోయింది**



నాకు రెండెకరాల సొంత భూమి ఉంది. దానికి తోడు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేశా. నెలరోజుల నుంచి బోర్లు తగ్గుతూ వచ్చాయి. వరిచేను ఎండిపోతుండడంతో మూడు బోర్లు వేశాం. వేసిన మూడు బోర్లూ ఫెయిలయ్యాయి. ప్రస్తుతం ఉన్న రెండుబోర్లు పూర్తిగా ఎండిపోయి చుక్క నీరు పోయడంలేదు. దీంతో నాలుగు ఎకరాల వరిచేను నిలువునా ఎండిపోయింది. ఏంచేయలేక పంటను వదిలివేశాం.

– గొడ్డేటి అంజయ్య, రైతు, వల్లాల, శాలిగౌరారం మండలం